క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వాహణ, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహణాధికారి పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దావాజిగూడెం, అల్లాపురం, పామర్తినగర్, రాజీవ్‌కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, భార్గవినగర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్, విద్యానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైభవంగా లక్ష పుష్పార్చన



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవార్లకు విశేష లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని ముగ్గురమ్మలను ఈ సందర్భంగా విశేషంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి హాజరైన మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవార్లకు విశేష లక్ష పుష్పార్చన (మల్లెపూలతో) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మహిళలు, భక్తులు పూలతో పాల్గొని అమ్మవార్లను సేవించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు.

కానూరులో యూపీహెచ్‌సీ ప్రారంభం

పెనమలూరు: కానూరు మురళీనగర్‌లో శనివారం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మండల పరిధిలో మూడు ఆస్పత్రులు ప్రారంభించామని తెలిపారు. వైద్య సిబ్బంది కూడా వైద్య సేవలు క్షేత్ర స్థాయిలో అందే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ మాట్లాడుతూ యనమలకుదురు, కానూరు, పోరంకిలో కొత్తగా ఆస్పత్రులు ఏర్పాటు చేసి వైద్య సేవలు విస్తృతం చేశామన్నారు. కానూరులో యూపీహెచ్‌సీలో సిబ్బంది త్వరలో పూర్తి స్థాయిలో నియమిస్తామన్నారు. జూన్ 21వ తేదీన జరగనున్న యోగా డేలో పాల్గొనే వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్య సేవలు అందించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మంజుల, సుస్మిత, రాజా, బిజిలీ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్యపుస్తకాలు



విజయవాడరూరల్: వచ్చే విద్యాసంవత్సరానికి అవసరమైన పాఠ్యపుస్తకాలను సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఏ.సూరిబాబు తెలియజేశారు. విజయవాడ రూరల్ మండలంలో అన్ని మండల పరిషత్ పాఠశాలలకు అవసరమైన 30,413 పాఠ్యపుస్తకాలనున్న జిల్లా పరిషత్ హైస్కూల్ స్టాక్ పాయింట్‌లో సిద్ధం చేశామన్నారు. 64 టైటిల్స్‌తో అన్ని సబ్జెక్టులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు విద్యా సంవత్సరం ప్రారంభం రోజున అనగా వచ్చే నెల 12వ తేదీన విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామన్నారు.

కాల్వల్లో వ్యర్థాల తొలగింపు



నున్న(విజయవాడరూరల్): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నున్న గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామ పంచాయతి ఆధ్వర్యంలో జేసీబీతో గ్రామంలో డ్రెయినేజీ కాల్వలో వ్యర్థాలను తొలగించి కాల్వల్లో మురుగుపారుదల అయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకొని ఉన్న డ్రెయినేజీ కాల్వ వెడల్పు చేసే పనులు చేస్తున్నారు. అంతర్గత డ్రెయినేజీ కాల్వల్లో పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను తొలగించే పనులు నిర్వహిస్తున్నారు. వర్షా కాలంలో ఎక్కడా వర్షంనీరు నిలబడకుండా చూడాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలనే డీపీఓ ఆదేశాల మేరకు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు.

నెత్తురోడుతున్న రహదారి

- డేంజర్ జోన్‌గా 16వ నంబర్ జాతీయ రహదారి
- అతి వేగం, మద్యం, నిద్ర మత్తుతో రోడ్డు ప్రమాదాలు
- ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం



వీరవల్లి వద్ద డివైడర్ దాటుకుని వచ్చి కారును ఢీకొట్టిన వాహనం (ఫైల్)



వీరవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు (ఫైల్)



ఎ.సీతారామపురం ప్రమాదంలో కారులో ఇరుక్కుపోయిన మృతురాలి శరీరం (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: చెన్నై– కోల్‌కత్తా జాతీయ రహదారి నిత్యం నెత్తురోడుతోంది. గన్నవరం నియోజకవర్గంలో హైవేపై రోడ్డు ప్రమాదాలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. సగటున రోజుకో యాక్సిడెంట్ జరుగుతోంది. ఆరు లైన్ల రహదారిగా విస్తరించినప్పటికీ రోడ్డు ప్రమాదాల జోరు మాత్రం తగ్గలేదు. అతి వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, మద్యం సేవించి వాహనాలను నడపటమే రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. రోడ్డు భద్రతపై పోలీసులు, రవాణా శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

ప్రమాదాలకు కారణాలెన్నో..

16వ నంబర్ జాతీయ రహదారి గన్నవరం నుంచి హనుమాన్‌జంక్షన్ వరకు ప్రయాణం డేంజర్ స్పాట్‌గా మారింది. మితిమీరిన వేగం, మద్యం మత్తు, తెల్లవారుజామున నిద్ర మత్తు, డ్రైవర్ల నిర్లక్ష్యం రోడ్డు ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. రోడ్డు పక్కన నడుస్తున్న పాదచారులు, రహదారి దాటుతున్న వ్యక్తులు కూడా వాహన చోదకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా మృత్యువాత పడుతున్నారు. వాహన చోదకుల నిర్లక్ష్యంతో ఎలాంటి సంబంధం లేకుండానే రోడ్డు ప్రమాదాలకు గురై ఆ కుటుంబాలకు తీరనిశోకాన్ని మిగుల్చుతున్నారు.

వరుస ప్రమాదాలతో బెంబేలు..

గడిచిన మూడు నెలల్లో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. తాజాగా హనుమాన్‌జంక్షన్ బైపాస్ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి వచ్చే మార్గంలో వేలేరు క్రాస్‌రోడ్డు వద్ద వరుసగా జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురు దుర్మరణం చెందారు. వీరవల్లి బైపాస్‌లో నిద్రమత్తులో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపటంతో డివైడర్‌ను ఢీకొని అవతలి వైపు రహదారిపైకి కారు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న మరో కారుపై బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందగా, ముగ్గురు చిన్నారులు సహా ఇద్దరు మహిళలు గాయాలపాలయ్యారు. ఈ దుర్ఘటనలో నూతన వధూవరులకు పెళ్లయిన 10 రోజులకే ఆయుష్షు నిండుకుంది. శేరినరసన్నపాలెం రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో పాదచారుడు శరీరం మొత్తం నుజ్జునుజ్జు అయింది. తేలప్రోలు, అంపాపురం, ఉమామహేశ్వరపురం, వీరవల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జిల వద్ద రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. షుగర్ ఫ్యాక్టరీ, హనుమాన్‌జంక్షన్ బైపాస్‌రోడ్డు, బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద కూడా ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.

దృష్టి పెట్టాలి..

అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్‌లను నివారించేందుకు తరుచూ తనిఖీలు చేపట్టాల్సిన పోలీసులు హైవేలపై పత్తా లేకుండా పోతున్నారు. రహదారిపై అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నా హైవే పెట్రోలింగ్ వాహనాల జాడ కానరావటం లేదు. హైవేపై డివైడర్ ఎత్తు అడుగు మాత్రమే ఉండటంతో అతివేగంతో నడుపుతున్న వాహనాలు ప్రమాదవశాత్తూ అదుపు తప్పి ఆ డివైడర్లను దాటుకుని అవతలి రోడ్డులో వెళ్లుతున్న వాహనాలపై పడుతున్నాయి. ఈ నేపథ్యంలో హైవేపై డివైడర్ల ఎత్తు మూడు అడుగులకు పెంచటం, అతి వేగాన్ని నియంత్రించేందుకు తనిఖీలు ముమ్మరం చేయటం ద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చు.

నివారణ చర్యలేవి?

16వ నంబర్ జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ పరిధిలో ఆత్కూరు టోల్ గేట్ నుంచి బొమ్ములూరు టోల్‌గేట్ మధ్య 20 కిలోమీటర్ల దూరంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్న 24 బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో రికార్డుల ప్రకారం గతేడాది 90కి పైగా యాక్సిడెంట్లు జరగ్గా, 40 మంది మృతి చెందారు. ఈ ప్రమాదాల్లో మరో 60 మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో 20 యాక్సిడెంట్లు జరిగాయి. ఈ ఘటనల్లో 15 మంది దుర్మరణం చెందగా, మరో 11 మంది క్షతగాత్రులైనట్లుగా పోలీసు లెక్కల్లో నమోదయ్యాయి. ఇవి కాకుండా నిత్యం హైవేపై ఎంతోమంది గాయాలపాలవుతున్నారు.

పోరంకిలో డ్రెయినేజీ నిర్మాణంపై వివాదం



వివాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్, కమిషనర్ భవానిప్రసాద్

పెనమలూరు: పోరంకిలో డ్రెయినేజీ నిర్మాణం వివాదంగా మారింది. గ్రామానికి చెందిన వ్యక్తి తన స్థలం నుంచి డ్రెయినేజీ ఎలా నిర్మిస్తారని అభ్యంతరం తెలపటంతో గ్రామంలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో పోరంకి– నిడమానూరు రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం పనులు ఇటీవల చేపట్టారు. అయితే వేణుగోపాలస్వామివారి ఆలయం ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలం పక్కగా డ్రెయినేజీ నిర్మాణం పనులు చేపట్టారు. అయితే ముసునూరు రామకృష్ణ తన స్థలం ఉందని, దీనిలో డ్రెయినేజీ నిర్మాణం చేయరాదని అభ్యంతరం తెలిపారు. దీంతో తాడిగడప మునిసిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, పోలీసులు ఘటనా స్థలం వద్దకు వచ్చారు. ఎంతకీ సమస్య తేలక పోవటంతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వచ్చి పరిశీలించి హద్దులు నిర్ణయించారు. స్థలానికి మరో పక్క అపార్టుమెంట్‌కు చెందిన ప్రైవేటు రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే సూచించి వెళ్లారు. కాగా ఎమ్మెల్యే వెళ్లిన తరువాత అపార్టుమెంట్ వాసులు తమ రోడ్డులో డ్రెయినేజీ ఎలా నిర్మాణం చేస్తారని అభ్యంతరం తెలపటంతో మరలా కొత్త వివాదం తలెత్తింది. ఇప్పటికే డ్రెయినేజీ నిర్మాణం అనేక లోపాలతో ఇష్టానుసారంగా నిర్మాణం చేయటంపై స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు. తాజా వివాదంతో డ్రెయినేజీ నిర్మాణం లోపాలు వెలుగు చూసింది. అనేక లోపాలతో జరుగుతున్న నిడమానూరు రోడ్డు డ్రెయినేజీ నిర్మాణంపై గ్రామంలో చర్చనీయంగా మారింది.

జాతీయ రహదారి జలమయం



వర్షపునీటితో నిండిపోయిన ప్రసాదంపాడు జాతీయ రహదారి

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలో శనివారం ఉదయం కురిసిన వర్షానికి జాతీయరహదారిపై భారీగా వర్షపునీరు చేరుకుంది. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో వర్షపునీటికి జాతీయ రహదారి మునిగిపోయింది. రహదారి కనిపించనంతగా వర్షపునీరు చేరుకోవడంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు పొంగి మురుగునీరు పైకి ఎగదన్నడంతో ఈ సమస్య ఉత్పన్నమయ్యింది. పలు గ్రామాల్లో వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని కాల్వగట్టు ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరుకుంది. ఆయా గ్రామాల్లోని డ్రెయిన్లు పొంగి మురుగునీరు సరఫరాకు ఆటంకంగా మారాయి.

అక్షర జ్ఞానంతోనే సమాజ ప్రగతి



ముస్తాబాద గ్రంథాలయంలో పుస్తక పఠనం



వణుకూరులో ఆటల పోటీల్లో విద్యార్థులు

గన్నవరం రూరల్: అక్షర జ్ఞానంతోనే సమాజ ప్రగతి సాధ్యమని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. దానికి పుస్తకాలకు దగ్గరగా, సెల్‌ఫోన్‌లు, టీవీలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని చెప్పారు. రేపటి తరం విద్యార్థులు మరింత నైపుణ్యంతో ఎదగాలని, అప్పుడే అవకాశాలు అందిపుచ్చుకుంటారని, దానికి పుస్తకాలు చదవటమే మార్గమన్నారు. పాఠకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పెనమలూరు: వణుకూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి, తోక కథలు చెప్పించారు. ఆ తరువాత విద్యార్థులకు మానసిక ఆనందం కోసం ఆటల పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు.



తెన్నేరు గ్రంథాలయంలో..

చదువుతో పాటు ఆటలూ ముఖ్యమే

కంకిపాడు: చదువుతో పాటు ఆటలూ ముఖ్యమేనని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కార్యక్రమానికి హాజరైన స్విగ్గీ, జొమాటో, వాహనాల యజమానులు



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్

ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసన్నకుమార్

విజయవాడ స్పోర్ట్స్: మోటారు వాహన చట్టం నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏడీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలోని స్విగ్గీ, జొమాటో రన్నర్స్, వాహనాలకు నంబర్ ప్లేట్ స్టిక్కరింగ్, కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లను ఏర్పాటు చేసే షాపుల యజమానులతో పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పక ధరించాలని, వాహన రికార్డ్స్ అన్ని ఉండాలని సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాన్ని నడపొద్దని సూచించారు. వాహనాల నంబర్ ప్లేట్లకు స్టిక్కర్లు వేసినా, కార్లకు బ్లాక్ ఫిల్మ్ అతికించినా చర్యలు తీసుకుంటామన్నారు. మోటారు వాహన చట్టం సూచించిన రంగు, సైజుల్లో మాత్రమే ప్లేట్లపై నెంబర్లు స్టిక్కరింగ్ చేయాలని, మరే ఇతర బొమ్మలు, సూక్తులు అతికించొద్దని ఆదేశించారు. తప్పుడు నెంబర్ ప్లేట్స్ తయారు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. 70% విజిబులిటీ మాత్రమే ఉండేలా కార్లకు బ్లాక్ ఫిల్మ్ అతికించాలని, కారు యజమాని అంతకు మించి డిమాండ్ చేస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ట్రాఫిక్ ఏసీపీ వంశీధర్, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



సత్యంగారి హోటల్ సెంటర్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని సత్యంగారి హోటల్ సెంటర్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. ఈప్రాంతంలో బారికేడ్లు తొలగించి, పోలీసు బీట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సత్యంగారి హోటల్ సెంటర్‌లో సీపీఎం తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ గత నెలరోజుల్లో ఈ ప్రాంతంలో రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం సమస్యకు వాస్తవ నివారణ చర్యలు చేపట్టకుండా ప్రజలను ఇబ్బందిపెట్టే విధంగా హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. వేల సంఖ్యలో కుటుంబాలు నివాసం ఉంటున్న కృష్ణలంక ప్రాంతాన్ని దిగ్బంధనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పుప్పాల కృష్ణ మాట్లాడుతూ వాహనాల వేగం తగ్గించేలా ఈ సెంటర్‌లో హైవేపై బ్లింకర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లు మూసుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కనీసం స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే ఎందుకు స్పందించడం లేదన్నారు. ఓట్లు కావాలి కానీ ఈ ప్రాంత ప్రజల సమస్యలు మాత్రం పట్టవా అని ప్రశ్నించారు. సీపీఎం తూర్పు నగర కార్యదర్శివర్గ సభ్యుడు కోరాడ రమణ, స్థానిక నాయకులు గోపి, రూబెన్, అప్పలనాయుడు, రామకృష్ణ, అనిల్, సిద్దు, చంద్రశేఖర్ తదితరులు పాలొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



కంకిపాడు: కార్యకర్తల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ కృషి చేస్తుందని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. పట్టణానికి చెందిన పోలేపల్లి జాన్ మృతి చెందటంతో ఆయన భౌతికకాయాన్ని శనివారం సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, తంబాబత్తుల ఓంకారం, మాదు రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్

పటమట(విజయవాడతూర్పు): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా భవననిర్మాణ కార్మికులకు పనులు దొరికేలా చేయడంలో పూర్తిగా విఫలమైందని సీఐటీయూ భవన నిర్మాణ విభాగం నగర అధ్యక్షులు రాజు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బెంజ్ సర్కిల్ కార్మికుల అడ్డా వద్ద శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మా ట్లాడు తూ కూటమి ప్రభుత్వంలో పనులు లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. భవన నిర్మాణ మెటీరియల్ రేట్లు విపరీతంగా పెరగడంతో కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు బిల్డర్లు ఆసక్తి చూపడం లేదన్నారు. మెటీరియల్ ధరలపై జీఎస్టీ తగ్గించి కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్మికులకు ఆసరాగా ఉన్న సంక్షేమ బోర్డుని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. బెంజ్ సర్కిల్ ముఠా నాయకులు మాజేటి నాగమల్లేశ్వరరావు, దుర్గారావు, రామకృష్ణ, వెంకన్న, అప్పారావు, నాయుడు, జోగి నాయుడు నరసింహారావు, కార్మికులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ డ్రెయిన్ నిర్మాణం



ప్రైవేట్ స్థలంలో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్

గన్నవరం: స్థానిక గ్యాస్ కంపెనీ ప్రాంతంలో ప్రైవేట్ స్థలంలో గ్రామ పంచాయతీ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేయడం వివాదాస్పదమైంది. సదరు డ్రెయిన్ నిర్మాణంపై స్థల యజమాని దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు స్టే విధించినప్పటికీ కాంట్రాక్టర్ లెక్కచేయకుండా పనులు సాగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ కంపెనీ ఏరియాలోని మొదటి రోడ్డులో నర్రా వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ సోదరులకు 80 సెంట్ల ఉమ్మడి స్థలం ఉంది. సదరు స్థలంలో నుంచి ఇటీవల గ్రామ పంచాయతీ నిధులతో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. దీనిపై గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో స్థల యజమాని నర్రా వెంకటేశ్వరరావు ఐదో అడిషనల్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించారు. డ్రెయిన్ నిర్మాణ పనులను నిలిపివేసి సదరు స్థలాన్ని యథాస్థితిలో ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశిస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. కోర్టు ఆదేశాలతో కొన్ని రోజుల పాటు పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ తిరిగి శనివారం డ్రెయిన్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ విషయాన్ని గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని స్థల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ధిక్కారానికి పాల్పడిన సంబంధిత వ్యక్తులపై న్యాయపోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు.

దాసాంజనేయునికి విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలోని సీతారామ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో 75వ హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆలయాన్ని సందర్శించి, స్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై సీతారామపురం, ఏపూరు, రైల్వే స్టేషన్, బాపులపాడు ఏరియాలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్రీడా వ్యవస్థపై ప్రభుత్వం చిన్నచూపు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడా వ్యవస్థ ఐక్యతను, క్రీడాకారులు ప్రయోజనాలను కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తుందని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పి.రావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. క్రీడా కోటా నియామకాలకు సంబంధించి గతనెలలో జీవోనంబరు 4ను విడుదల చేయగా, తాజాగా ఈనెల 23వ తేదీన విడుదల చేసిన జీవోనంబరు 9 ఉత్తర్వులు క్రీడాకారుల ప్రయోజనాలను కాలరాసేలా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. క్రీడా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న సవతిప్రేమను ఈ రెండు జీవోలు బహిర్గతం చేశాయని పేర్కొన్నారు. జీవోనంబరు 4లోని ఏ, బి కేటగిరిల విభజన సహేతుకంగా లేదన్నారు. జూనియర్స్ సర్టిఫికెట్లు, స్కూల్ గేమ్స్ సర్టిఫికెట్లకు కోటాలో అర్హత కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నా ఉపయోగం లేకుండా పోయిందన్నారు. జీవోనంబరు 9లో ఏ కేటగిరిలోని క్రీడలకు 100 శాతం పారితోషకాలు, బి కేటగిరిలోని క్రీడలకు 50 శాతం పారితోషకాలు ఇస్తానని ప్రకటించడం వివక్షకు దారితీసిందన్నారు. ప్రభుత్వ నిర్వాకంతో రానున్న రోజుల్లో క్రీడా సంఘాలు, క్రీడాకారుల మధ్య విబేధాలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. జీవో లు రూపొందించిన అధికారులకు ఏమాత్రం క్షేత్ర స్థాయిలో క్రీడా పరిజ్ఞానం లేదనేది ఈ జీవోలను చూస్తే స్పష్టమవుతుందన్నారు. ఈ జీవోలపై దృష్టి సారించి సవరణ చేయాలని సీఎం చంద్రబాబుకు పలుమార్లు లేఖలు రాసినట్లు చెప్పారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. లేదంటే రానున్న రోజుల్లో న్యాయ పోరాటం చేస్తానన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు కృషిచేస్తున్నారు. హక్కుల రక్షణ, రాష్ట్రంలో క్రీడల ఉనికిని కాపాడుకునేందుకు అందరూ ఏకతాటి పైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

రోడ్డుపై పారుతున్న మురుగు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక రత్నమాంబవీధిలో ఉన్న భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగునీటితోపాటుగా వ్యర్థాలు బయటకు వస్తున్నాయి. రోడ్డు ఎత్తుగా ఉన్న ప్రాంతంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఉండటంతో అందులో నుంచి వచ్చే మురుగు నీరు, వ్యర్థాలన్నీ పల్లంగా ఉన్న వైపునకు ప్రవహిస్తూ ఆప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. పలు ఆస్పత్రులు, దుకాణాలు, హోటళ్లు ఉండటంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డుపై మురుగు పారుతుండటంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

90105 77706 (ఉయ్యూరు)

99122 20539 (పెనమలూరు)

90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com